మౌలిక సదుపాయాలకు నోచుకోని అంబాపురం

- డ్రెయినేజీలు లేక ఎక్కడికక్కడే మురుగు తిష్ట
- చెరువులను తలపిస్తున్న మురుగు
- తాగునీటికి ప్రైవేటు ఆర్వో ప్లాంటే దిక్కు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

విజయవాడరూరల్: విజయవాడ నగరానికి అత్యంత సమీపంలో ఉన్న అంబాపురం(ఒకటో వార్డు)గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు లేక స్థానికులు అనేక అవస్థలు పడుతున్నారు. రాకపోకలకు రోడ్లు ఉండవు, తాగటానికి నీరు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజానీకం సమస్యలను అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి వర్షానికే ఇళ్ల మధ్య నీరు రోజుల తరబడి నిల్వ ఉండి మురుగు చెరువులను తలపిస్తున్నాయి. మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమల ఉధృతికి వ్యాధులు సోకి రోగాలపాలవుతున్నారు. ప్రభుత్వ వైద్య సదుపాయం అందక ప్రైవేటు ఆర్ఎంపీలను ఆశ్రయించాల్సిన దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్నారు.

మురుగునీరు పారే మార్గంలేదు

విజయవాడ రూరల్ మండలంలోని అంబాపురం గ్రామం విజయవాడ నగరంలో ప్రధాన భాగమైన పైపులరోడ్డును ఆనుకొని ఉంటుంది. వెయ్యి గృహాలతో మూడు వేల జనాభా ఉన్న అంబాపురం గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్ది నెలలకే గతేడాది సంభవించిన బుడమేరు వరదల్లో పూర్తిగా ముంపునకు గురైనా ఇంతవరకు అంతర్గత



అంబాపురం గ్రామంలో మురుగునీటి తటాకాలు

రోడ్లు, డ్రెయిన్లు నిర్మించలేదు. స్థానికులకు తాగేందుకు నీటి సదుపాయం లేదు. వరద నీరు, మురుగునీరు పారే మార్గంలేదు. డ్రెయినేజీ కాల్వలు లేకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిల్వ ఉండటంతో మురుగు నీటి చెరువులను తలపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వర్షం నీటికి, ప్రజల వాడుకనీరు తోడుకావడంతో ఇళ్ల మధ్య మురుగు నీరు రోజుల తరబడి ఉండటంతో దోమల ఉధృతికి ప్రజలు వైరల్ ఫీవర్స్ తో బాధపడుతున్నారు. సర్కారు వైద్యం అందుబాటులో లేక రోగులు ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఆర్థిక స్థితి బాగున్న వారు విజయవాడలో కార్పొరేట్ వైద్యం చేయించుకుంటున్నారు.



గుంతలమయంగా అంతర్గత రోడ్డు

కనీస వసతులు కల్పించాలి..

గ్రామంలో తాగేందుకు మంచినీటి సదుపాయం లేకపోవడంతో ప్రతి కుటుంబం ప్రతి రోజూ ప్రైవేటు ఆర్వో ప్లాంటులను ఆశ్రయిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ 70 లక్షల రూపాయలతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించారు. వీఎంసీ వాటర్ తీసుకొచ్చే ప్రయత్నంలో ఎన్నికల కోడ్ రావడంతో ఆ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పిమ్మట ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మిస్తామని పాలకులు వాగ్దానం చేసినా ఇంతవరకు ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. కనీసం తాగునీరు, ప్రభుత్వ వైద్య సదుపాయం, పిల్లల చదువుకు ప్రాథమిక పాఠశాల, డ్రెయినేజీలు, రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగుతో రోగాల భయం..



ఒకటో వార్డులో కనీస సదుపాయాలు లేవు. ఎక్కడి మురుగు అక్కడే నిల్వ ఉంటుంది. రోగాల భయంతో ఆందోళన చెందుతున్నాం. తాగునీరు లేక రోజూ 20 రూపాయలతో ఆర్వో ప్లాంటు నుంచి కొనుగోలు చేస్తున్నాం.

– కందకట్ల సాయికుమార్, గ్రామస్తుడు, అంబాపురం

చర్యలు తీసుకుంటాం..



ఒకటో వార్డులో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నాం. అంతర్గత రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి గ్రామ పంచాయతీ ప్రతిపాదనలు చేసింది. త్వరలో వసతులు కల్పిస్తాం.

– డి.శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి

క్లుప్తంగా

గ్రామాల్లో తాగునీటి శాంపిల్స్ సేకరణ



విజయవాడరూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయవాడ రూరల్ మండలంలోని గ్రామాల్లో ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి శాంపిల్స్‌ను సేకరిస్తున్నారు. ఇటీవల విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజరాజేశ్వరిపేటలో డయేరియా వలన ఇద్దరు మృతిచెందడం, పలువురు వ్యాధిబారిన పడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా అధికారులు శాంపిల్స్ సేకరిస్తున్నారు. సేకరించిన తాగునీటి బాటిల్స్‌ను నున్న గ్రామంలోని సచివాలయం 2లో వైద్య సిబ్బందితో పరీక్ష చేసి నివేదికను ప్రభుత్వానికి పంపుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీరు నాణ్యత పరీక్షల్లో నీరు సక్రమంగా ఉన్నాయని గ్రామీణ నీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఇంజినీర్ శ్వేత తెలిపారు.

ఆరోగ్య రక్షణపై అవగాహన అవసరం



గన్నవరంరూరల్: విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ పట్ల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని ఆత్కూరు పీహెచ్‌సీ డాక్టర్ జితేంద్రకుమార్ సూచించారు. మండలంలోని తెంపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులతో శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్‌గా టైఫాయిడ్, డెంగ్యూ, వైరల్ జ్వరాలు వస్తుండడంతో వాటి లక్షణాలను వివరించారు. జాతీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆరోగ్య పరిస్థితులు నమోదు చేయాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు, వైద్య సిబ్బంది అంకమ్మ, అనిత, మేరీ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ అంధకారం



గన్నవరంరూరల్: మత్తు పదార్థాలతో భవిష్యత్ అంధకారమవుతుందని హెచ్‌ఎం నాగవేణి తెలిపారు. మండలంలోని ముస్తాబాద జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం విజయవాడ నవజీవన్ బాల భవన్, నీ తోడు మానసిక వికాస కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు అవగాహన కలిగి ఉండి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. జోనల్ కో-ఆర్డినేటర్లు జాకబ్ రాజు, ప్రియాంక, మహిళా పోలీస్ శ్రావణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సిద్ధార్థ లా కాలేజీలో ఏఐబీఈ మాక్ టెస్ట్

పెనమలూరు: కానూరు వెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ లా కాలేజీలో లా విద్యార్థులకు శనివారం ఏఐబీఈ మాక్ టెస్ట్ నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నుపాటి దివాకర్‌బాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ సిద్ధార్థ లా కాలేజీ, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ సంయుక్తంగా రాష్ట్రంలో నూతనంగా లా పట్టా పొందిన విద్యార్థులకు ఉచితంగా శనివారం ఏఐబీఈ మాక్ పరీక్ష నిర్వహిస్తోందన్నారు. పరీక్ష శనివారం ఉదయం 10 గంటలకు కానూరు సిద్ధార్థ లా కాలేజీలో జరుగుతుందన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలకు లోబడి పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు వారి నైపుణ్యం మెరుగుపర్చుకోవటానికి ఈ పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందని, ఇప్పటికే 300 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. పరీక్షలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని చెప్పారు.

సీతారాం ఏచూరి ఆశయ సాధనకు పోరాటం



పెనమలూరు: సీపీఎం సీనియర్ నేత సీతారాం ఏచూరి ఆశయ సాధన కోసం నేటి యువత పోరాటం చేయాలని ఆపార్టీ నేతలు పిలుపునిచ్చారు. సీతారాం ప్రథమ వర్ధంతిని మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యనమలకుదురు, పోరంకి, వణుకూరు గ్రామాల్లోని సీపీఎం కార్యాలయాల వద్ద వర్ధంతి కార్యకమాలు చేపట్టారు. యనమలకుదురు వీఎల్‌భవన్ వద్ద సీపీఎం మండల కార్యదర్శి షేక్.ఖాశిం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నాయకులు షేక్.మస్తాన్‌వలి, పాతాళ లక్ష్మి, పాపారావు, మాధవ, సత్యనారాయణ, భవాని, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

డ్రెయినేజీ మురుగుతో అవస్థలు

కంకిపాడు: డ్రెయిన్లు పొంగి మురుగు రోడ్లపై పారుతుండటంతో కంకిపాడు పట్టణంలో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల స్థాయి అధికారులు ఉండే కార్యాలయానికి వెళ్లే రోడ్డు మార్గంలోనే ఈ సమస్య నెలకొన్నా అధికారులు అలసత్వం ప్రదర్శిస్తుండటం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కంకిపాడు పట్టణంలోని చెరువు కట్ట సమీపంలో మండల పరిషత్, తహసీల్దార్, హౌసింగ్, ఐసీడీఎస్, వెలుగు, ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. ఈ కార్యాలయాలకు విజయవాడ-మచిలీపట్నం రోడ్డు నుంచి కంకిపాడు-గన్నవరం రోడ్డు వద్ద సబ్‌స్టేషన్‌ను కలుపుతూ ప్రధాన రోడ్డు మార్గం ఉంది.

ఈ మార్గంలో డ్రెయినేజీల శుభ్రత అస్తవ్యస్తంగా తయారైంది. మురుగుతో పూడుకుపోవటం, పక్కనే ఉన్న మురుగుబోదె మురుగు డ్రెయినులోకి చేరుతుండటంతో డ్రెయినులోని మురుగు రోడ్డుపైకి వస్తుంది. డ్రెయిను మురుగు కావటంతో పాదచారులు ఆ మార్గంలో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఆయా శాఖల కార్యాలయాల వద్దకు వివిధ పనులు నిమిత్తం మండలంలోని అనేక గ్రామాల నుంచి



రోడ్డుపై పారుతున్న డ్రెయినేజీ మురుగు

ప్రజలు నిత్యం వస్తుంటారు. ఇలాంటి ప్రధానమైన రోడ్డులో డ్రెయినేజీ మురుగు నిత్యం పారుతుండటం అధికారుల పనితీరును ఆక్షేపిస్తోంది. అధికారుల బాధ్యతారాహిత్యం కారణంగానే మురుగుతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. అసలే అడపాదడపా కురుస్తున్న వర్షాలకు డ్రెయినేజీ మురుగు తోడైతే ప్రజారోగ్యం ప్రమాదంలో పడే అవకాశముంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

దోమల నిర్మూలనకు పటిష్ట చర్యలు

పి.నైనవరం(విజయవాడరూరల్): ఫ్రైడే డ్రైడే సందర్భంగా గ్రామాల్లో దోమల నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపట్టారు. పి.నైనవరం గ్రామంలో డ్రెయిన్స్‌లో దోమల నిర్మూలనకు గ్రామ సర్పంచి బట్టా సోమయ్య, పంచాయతి కార్యదర్శి అజేంద్ర సచివాలయ సిబ్బంది ఆయిల్‌బాల్స్ వేయించారు. ప్రధాన, అంతర్గత డ్రెయిన్స్‌లో ఆయిల్‌బాల్స్ వదిలి లార్వాను అదుపు చేస్తున్నట్లు కార్యదర్శి తెలిపారు. అంబాపురం గ్రామంలో ఫ్రైడే డ్రైడే సందర్భంగా మురుగు కాల్వల్లో బ్లీచింగ్ సున్నం చల్లారు. వర్షం నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ చల్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది తెలిపారు. పాతపాడు, నున్న గ్రామాల్లో వైద్య సిబ్బంది మురుగు కాల్వల్లో దోమల నివారణ మందులను స్ప్రే చేశారు. డబ్బాల్లో నిల్వ ఉన్న



పి.నైనవరంలో ఆయిల్ బాల్స్ వేయిస్తున్న సర్పంచ్ సోమయ్య

నీటిని పారపోయించారు. వర్షంనీరు కుంటల్లో నిల్వ ఉన్న చోట దోమలు, లార్వా నివారణకు చర్యలు చేపట్టారు.

బిల్డింగ్ వర్కర్స్ మహాధర్నాకు తరలిరండి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 15వ తేదీన విజయవాడలోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజనాల సురేష్ కోరారు. హనుమాన్‌జంక్షన్‌లోని భవన నిర్మాణ కార్మికుల అడ్డాల వద్ద శుక్రవారం ఉదయం మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించి, వర్కర్లకు కరపత్రాలను పంపిణీ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా బిల్డింగ్ వర్కర్స్‌కు ప్రమాద బీమా, మహిళా కూలీలకు వివాహం, ప్రసవ సమయాల్లో ఆర్థికసాయం అందించాలని కోరారు. కార్మికుల పిల్లల చదువులకు ఉపకార వేతనాలు అందించాలన్నారు. ఇప్పటి వరకూ బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు వద్ద పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరితగతిన



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సురేష్ తదితరులు

పరిష్కరించాలన్నారు.

ఈ నెల 15న భవన నిర్మాణ కార్మికులంతా పనులు నిలుపుదల చేయాలని, లేబర్ కమిషనర్ ఎదుట మహాధర్నాకు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నరసయ్య, రాజా ప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లి సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుపల్లి, వేమండ, నందమూరు, మానికొండ, చాగంటిపాడు, చికినాల, బొకినాల, మదిరిపాడు గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ జీబీ శ్రీనివాసరావు చెప్పారు.

గన్నవరం: గన్నవరం మొత్తం ఏరియా, మర్లపాలెం, చిన్న ఆవుటపల్లి, దుర్గాపురం, ఎయిర్‌పోర్ట్ సిటీ, స్లేట్ స్కూల్, గొల్లనపల్లి, బీబీ.గూడెం గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ పి.హరిబాబు శుక్రవారం చెప్పారు.

పెనమలూరు సెక్షన్‌లో..

పెనమలూరు: పెనమలూరు, గంగూరు, గోసాల, వణుకూరు, చోడవరం గ్రామాల్లో, పోరంకి పరిధిలోని బీజేఆర్‌నగర్, నిడమానూరు రోడ్డు, మహాలక్ష్మినగర్, వసంతనగర్, విష్ణుపురంకాలనీ, సాయినగర్, గద్దె ఆర్‌టీసీ కాలనీ, లక్ష్మీపురంకాలనీ, రంగా బొమ్మ సెంటర్, ప్రభూనగర్, రామాపురంకాలనీ, సీతాపురంకాలనీ, సాలిపేట, బందరు రోడ్డు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ కి.రామ్మూర్తి తెలిపారు. యనమలకుదురు పరిధిలోని శివప్రసాద్‌నగర్, గ్యాస్ గోడౌన్ ప్రాంతం, హోసన్న మందిరం, ఎంవీఆర్‌నగర్, శ్రీనగర్ కాలనీ, గ్రీన్‌సిటీ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని రామ్మూర్తి చెప్పారు. తాడిగడప పరిధిలోని తాడిగడప గ్రామం, శ్రీనివాసానగర్ కాలువ కట్ట, పద్మజానగర్, లిబ్రా కాలనీ, కార్మికనగర్, ఎస్‌టీబీఎల్‌కాలనీ, పెదపులిపాక గ్రామం, యనమలకుదురు, తాడిగడప, పెదపులిపాక వ్యవసాయ కనెక్షన్‌లకు శనివారం ఉదయం 8.30 నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామ్మూర్తి చెప్పారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

పీవీపీ సిద్ధార్థలో 105 మంది విద్యార్థుల రక్తదానం



పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం విద్యార్థులు రక్తదానం చేశారు. కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విజయవాడ లయన్స్ బ్లడ్ బ్యాంక్ రక్తదాన శిబిరం నిర్వహించింది. 105 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కాలేజీ కన్వీనర్ వెల్లంకి నాగభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీ బాబు, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ శ్యామ్, టి.శ్రీహరిరావు, వి.లలిత, విద్యార్థులు పాల్గొన్నారు.

యనమలకుదురులో క్షీణించిన పారిశుద్ధ్యం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో పూర్తిగా పారిశుద్ధ్యం క్షీణించింది. గత కొద్ది రోజులుగా గ్రామంలో చెత్త కుండీలలో చెత్త ఎత్తటం లేదు. దీంతో తీవ్ర దుర్గంధం రావటంతో గ్రామస్తులు చాలా ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో కొండ వెనుక ప్రాంతంలో చెత్త సేకరణకు ప్రత్యేకంగా చెత్త కుండీలు ఏర్పాటు చేశారు. తాడిగడప మున్సిపాలిటీకి చెందిన ప్రత్యేక చెత్త వాహనంతో చెత్త తరలిస్తారు. అయితే గత కొద్ది రోజులుగా చెత్త సేకరణ వాహనం రాకపోవటంతో ఎక్కడి చెత్త అక్కడే ఉండి పోయింది. కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాల్య వివాహాలు ప్రగతి నిరోధకాలు

గన్నవరంరూరల్: బాల్య వివాహాలు సమాజ ప్రగతికి నిరోధకాలని సూరంపల్లి సర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యాన బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలపై జరిగిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. బాలికలను చిన్నచూపు చూడటం తగదని, వారికి మంచి చదువు, భద్రత ఇవ్వాలని చెప్పారు. ఐసీడీఎస్ సీనియర్ సూపర్‌వైజర్ సీహెచ్ నాగపద్మావతి మాట్లాడుతూ.. బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 18 సంవత్సరాలు నిండకుండా బాల్య వివాహం చేయాలని ప్రయత్నిస్తే 10983 లేదా 181కి ఫోన్ చేసి తెలపాలని కోరారు. బాల్య వివాహాలతో బాలికలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారన్నారు. బాలికలను విద్యా వంతులుగా చేయాలని సూచించారు. సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్‌లు, క్రాఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్య వంతంగా జీవించాలి

పెనమలూరు: మహిళలు ఆరోగ్యవంతంగా జీవించాలని రెయిన్‌బో ఆస్పత్రి సీనియర్ కన్సల్‌టెంట్ డాక్టర్ ఎం.విజయ అన్నారు. సిద్ధార్థ డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్యంపై శుక్రవారం అవగాహన



సూరంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

సదస్సు నిర్వహించారు. మహిళలకు సమతుల్యమైన ఆహారం, ఆరోగ్య వంతమైన జీవన శైలి అలవాట్లు, క్రమమైన ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రో.ఉపకులపతి డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ జె.శివరామ్‌ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం వెల్దిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కిశోర బాలికలకు సంకల్ప్ ప్రత్యేక అవ



వెల్దిపాడులో అవగాహన కల్పిస్తున్న ఎంపీహెచ్‌పీ సునీత

గాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ జి.సునీత మాట్లాడుతూ.. కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతిరోజు ఆహారంలో ఆకుకూరలను తీసుకోవాలని చెప్పారు. అదే విధంగా రాగులు, జొన్నలు, కొర్రలు, వరిగలు, సామలు వంటి చిరుధాన్యాలను ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. వ్యాయామం, ఆటలు, యోగా సాధన ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీతారాం, ఏఎన్ఎం ఎస్‌జె.ఆశీర్వాదమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

417 విద్యుత్ సర్వీసులకు రూ.7.06 లక్షల జరిమానా

హనుమాన్‌జంక్షన్‌రూరల్: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఏపీ సీపీడీసీఎల్ విజిలెన్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ వాసు హెచ్చరించారు. బాపులపాడు మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్, విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ విభాగం ఈఈ వాసు, గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు 47 బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ సర్వీసులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో 417 విద్యుత్ సర్వీసులు అదనపు లోడు వినియోగిస్తున్నట్లుగా గుర్తించి, వారికి రూ.7.06 లక్షల జరిమానా విధించారు. హనుమాన్‌జంక్షన్ సబ్ డివిజన్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజినీర్ ఐ.రుక్మిణి కల్యాణి, గుడివాడ డివిజన్ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు... మచిలీపట్నం బలరాముని పేటకు చెందిన వేముల నాగరాజు(40) ఈనెల 10వ తేదీన బైక్‌పై మచిలీపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్తుండగా కంకిపాడు-పునాదిపాడు ఫ్లై ఓవర్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ నాగరాజును 108 అంబులెన్స్‌లో వైద్యం నిమిత్తం తరలించారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసుటు ఘటనపై కేసు నమోదుచేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



గన్నవరం: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ ప్లస్ విద్యార్థినులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ ఎ.సుశీల తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ...విజయవాడలో ఈ నెల 11న ఫెన్సింగ్ అండర్-19 జట్ల ఎంపిక నిర్వహించామన్నారు. తమ విద్యార్థినులు ఈ.సాహితి, టి.రేవతి, జి.ప్రవీణ, ఎం.మౌనిక ఉత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరందరూ గుంటూరులో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అనంతరం ఎంపికైన విద్యార్థినులను, వీరికి శిక్షణ ఇచ్చిన డి.నాగరాజు, ఎస్‌కే మీరాసాహెబ్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు.

అసైన్‌మెంట్ భూములు ఆన్‌లైన్ చేయాలని రిలే దీక్ష

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం ఎలుకపాడుకు చెందిన అసైన్‌మెంట్ భూ లబ్ధిదారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాల్గవ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కూర్చొన్న వారికి వ్యవసాయ కార్మిక సంఘం నేత అజ్మీరా వెంకటేశ్వరరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1979-80లో ప్రభుత్వం 12 ఎకరాల ఎసైన్‌మెంట్ భూమిని ఎస్సీ, బీసీలకు పది సెంట్లు చొప్పున పంపిణీ చేసిందన్నారు. వీరిలో కొంత మంది భూములకు అధికారులు పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేసినప్పటికీ ఇంతవరకు ఆన్‌లైన్ చేయలేదన్నారు. దీనివల్ల ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ పథకం అందకపోవడంతో పాటు ప్రకృతి విపత్తుల సమయంలో పంట నష్టం అందడం లేదని చెప్పారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీక్షలో ప్రసంగి, సుగుణరావు, యాకోబు, కోటేసు, జ్ఞాననందం, దేవమాత, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్ష చేస్తున్న ఎలుకపాడు వాసులు

యనమలకుదురులో వ్యక్తిపై దాడి

పెనమలూరు: యనమలకుదురులో ఓ వ్యక్తిపై బిర్యానీ హోటల్ యజమాని దాడి చేసిన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురుకు చెందిన టి.విజయ్‌కుమార్ గ్రామంలోని ఓ బిర్యానీ పాయింట్‌లో బిర్యానీ తీసుకోని బిల్లు చెల్లించి వెళ్లాడు. షాపు యజమాని మోపిదేవి రవీంద్రబాబు కొద్ది సమయం తరువాత విజయ్‌కుమార్‌కు ఫోన్ చేసి బిల్లు చెల్లింపుపై ప్రశ్నించాడు. దీంతో విజయ్‌కుమార్ హోటల్ వద్దకు వచ్చి బిల్లు విషయమై రవీంద్రబాబుతో మాట్లాడుతన్న సమయంలో వివాదం తలెత్తింది. దీంతో విజయ్‌కుమార్‌పై రవీంద్రబాబు దాడి చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.